# అమృతధారలు



రాయలసీమలో పల్లె అది.

పల్లెవాసులందరూ మూట ముల్లె సర్దుకొని ప్రయాణమవుతున్నారు. తినటానికి తిండిలేక తాగటానికి నీరులేక ఏ ఏటి కాయేడు భగవంతునిమీద భారంవేసి పుట్టిన పల్లెను ఆ పరిసరాలను అంటిపెట్టుకొని ఇంతవరకు జీవిస్తూ వచ్చారు. కాని ఈ ఏడు తాగటానికి గుక్కెడు నీళ్ళు కూడా లేకపోవటం వల్ల ఉన్న ఊరు వదిలిపెడుతున్నారు.

కొంపలోనుండి బయటికి వచ్చిన నరిసిగాడు ఆకాశం వైపు చూశాడు. అక్కడక్కడ వెల్లని మబ్బులు తేలియాడుతున్నాయి. వాని మనస్సులో ఆశాఘాతం తలుక్కుమంది.

"అయ్యా", ఇక కట్టేయ్యనా? అని [illegible] నరిసిగాని కొడుకు అవుమీద సామాను [illegible].

అంతలోనే ఎదురుగా ఉన్న ముత్యాలు కొంపలో నుండి రంగి ఏడ్పులు వినిపించాయి. ఎముకలగూడులా ఉన్న కొడుకు శవాన్ని ముత్యాలు బయటికి తెచ్చాడు. నరిసిగాడు శవం దగ్గిరగా వెళ్ళిచూశాడు. శవంమీద నడుముకు కట్టిన పాతగుడ్డ తప్ప ఏమీలేదు. రెండు పెదవులమధ్య ఎండిపోయిన నాలికతో ముఖం వికృతంగా కనిపిస్తూంది. రంగి శవంమీదపడి లబోదిబో మంటున్నది.

"ఓసేయ్ ఎందుకలా గొంతు చించుకొంటా.

నాలిక తడుపుకోను చుక్క కూడా గుక్కెడు నీళ్ళు దొరకవు" అని పెళ్లాన్ని మందలించి తనంతో ముత్యాలు ఏటివైపు పోయాడు.

పెదబాబు గారి ఇంటివైపు వెళ్ళుతున్న నరిసిగాడు చిన్న గుడిసె ముందు నిలిచి "గంగీ! గంగమ్మా!" అని పిలిచాడు.

"ఎవరు?" అంటూ లోపలినుండి గంగి క్షీణ స్వరంతో అంది. లోపలికి వచ్చిన నరిసిగాడిని చూసి "నీవా! నరసన్నా?" అంది.

"ఏందే అందరూ అక్కడా మూట, ముళ్ళె సర్దుకొని ఊరిడిసి ఎళ్లిపోతుంటే నీవు ముసుగు తన్నిపడుకొన్నావు?"

"నేను రాలేను నరసన్నా. మావతోపాటే నేను. మీరెళ్లండి" అంది ఆయాసపడుతూ గంగి.

నరిసిగాడు గంగి అవస్థచూసి "గంగులు రేతిరి సేసిన పనికి గుక్కెడు నీళ్ళ కూడా సిక్కకుండా పోయాయి" అంటూ అక్కడ నిలవక పెదబాబుగారి ఇంటివైపు కదిలాడు.

"ఏరా, నరిసిగా నీవు రావటంలేదా?" అని పెదబాబు అడిగాడు.

"వస్తున్నా పెదబాబూ! అని నరిసిగాడు అన్నాడు. కానీ గంగులు పెళ్లామే రావంటుంది బాబు" అన్నాడు తిరిగి.

"రాత్రి ఏం జరిగింది అనుకొన్నావు నరిసిగా! ఆ గంగులు బావిలోనికి రాళ్ళు రప్పలు వేసి పారిపోయాడు.

"ఎంత వానలు రాకపోయినా, గుక్కెడు నీళ్ళ దొరికే ఈ బావిలో కూడా రాళ్ళ రప్పలు వేసి ఆ గుక్కెడు నీళ్ళ లేకుండా సేసినాడు!

"ఇంతమంది నోరుకొట్టిన ఆ దుర్మార్గుడు రానీ కాల్చిపారేస్తాను" అన్నాడు పౌరుషంగా పెదబాబు. మాటలుతే అన్నాడు కాని లోపల పెదబాబు గుండె దడదడ లాడింది వాడు అనుకున్నంత పని చేస్తాడని.

చింతలవల్లి నాయుడి గతేమయింది?

గుంగుల్ని పిలిచి "ఒరేయ్! ఆ నాయుడు మనతో పోటీ వస్తున్నాడు, చూడరా అన్నాడు, ఒకసారి."

అంతే!

మరునాటి రోజు పట్నంనుండి తిరిగి వస్తున్న నాయుణ్ణి పట్టుకొని "మా పెదబాబుకే పోటీ సేత్తున్నావట! మా పెదబాబు మాట కెదురుసెప్పి బతికిన మడిసి లేడు" అంటూ నాయుడి మెడ పట్టుకొన్నాడు గంగులు.

"గంగులూ నీకేం అపకారం చేశాను రా నేను? నన్ను వదిలిపెట్టు. నీ కెంత డబ్బుకావాలన్నా ఇస్తాను. నన్ను వదులురా" అని బ్రతిమాలాడు నాయుడు.

"మా పెదబాబుమాట కాదని బతికిన మడిసి ఈ పెపంచంలో లేడు, ఉన్నా అదితం నేను కోరగాలసిందే" అంటూ తల నరికేశాడు.

గంగులు అనుకున్నాడంటే ఎవరినైనా సరే నిలువునా నరికేస్తాడు. కుటుంబంలో ఉన్న వాడిని విడిపించేందుకు ఐదు వచ్చునోట్లు వదులుకొన్నాడు. వాడి చేష్టలన్ని అంతే! చాలా కఠినంగా ఉంటాయి. రంగమణి కూతురు విషయంలో కూడా అంతే జరిగింది.

> గుక్కెడు నీళ్లు దొరక్క సంసారాన్ని గంపకెత్తుకుపోవడం హృదయవిదారకంగానే కనిపిస్తుంది. అలా ప్రవాసానికి పయనమైన అబలలపై కక్షగట్టిన రాక్షసాన్ని మానవహృదయం క్షమించదు. కానీ రాక్షసాన్ని సైతం మాతృహృదయం క్షమించి, అమృతత్వాన్ని అందించగలదు.

"మీకెందుకు పెదబాబు ఇచారం. మూడో రేతిరి కల్లా మీ కాళ్ల ముందు పడేయకపోతే ఈడుసిన ఈర గంగులుకాడు" అంటూ మీసం మెలిపెట్టాడు.

అన్నట్లుగానే మూడో రాత్రికి రంగమణి కూతుర్ని తన పాదాల ముందు పడవేసి "పెదబాబూ, అడొచ్చిన ఆ ముసలిదాని గొంతు నులిమి దీన్ని లేవనెత్తుకొచ్చాను" అంటూ తనతో చెప్పి "ఇదిగో గుట్టుమట్టుకాకుండా మా పెదబాబు సెప్పినట్టు ఇనుకో. రూకలు నీ ఒళ్లో గలగలరాలతాయి! పెట్టుసేసి, మీ తల్లి గతేనీకు" అంటూ గుడ్లురిమి చూశాడు.

ప్రతి విషయంలోను అంతేవాడు. బాగ తాగాడా వాడేమిచేస్తాడో వాడికే తెలియదు! ఆ పంతులమ్మ నెల రోజుల పసికందును పొడిచి చంపాడు.

నిన్నటి వాడి ఆకారం రాత్రి తనకు నిద్ర రానిచ్చింది కాదు. కళ్ళు మూసుకొంటే మరింత వికృతంగా అగుపించేది వాడి ఆకారం! "పెదబాబూ" అంటూ పిడికిలి బిగించి నేలమీద అడుగు ఎత్తిన వాడి స్థూలకాయం పైకి లేవటము, నల్లని శరీరంలోని రక్తనాళాలు పొంగటము, పళ్ళు పటపటమంటు కొరకటము తన శరీరాన్ని జలదరింపజేశాయి.

"ఛీ . . . ఛీ" అంటూ కళ్ళు మూసుకొన్నాడు పెదబాబు. అయినా వాడి ఆకృతి మరోమారు అతని మదిలో మెదిలింది. నిన్నటి సంఘటన మరీ మరీ జ్ఞాపకానికి వచ్చింది పెదబాబుకు.

"పెదబాబూ! పెదబాబూ!" అంటూ పరిగెత్తుకు వచ్చాడు గంగులు.

పడక కుర్చీలో కూర్చుని తాపీగా సిగరెట్టు వెలిగిస్తున్న పెదబాబు వాడిని చూసి "ఏం రా? ఏం జరిగింది, అంత ఆవేశ పడుతున్నావు?" అని అడిగాడు.

"మా ముసలిదాని గొంతెండుకపోయి నాలిక పిడచ కట్టింది పెదబాబూ. గుక్కెడు నీళ్ళ కావాలి!" అని పెదబాబు నడిగాడు గంగులు.

నోట్లో వెలుగుతున్న సిగరెట్టు తీసి "నీళ్ళా?" అన్నాడు ఆశ్చర్యంగా పెదబాబు.

"పొద్దున గంగి వచ్చి ముంతలో పోయించుకొని పోయిందిగా!" అన్నాడు మళ్లీ సిగరెట్టు నోట్లో ఉంచుకొని గుప్మని పొగవదలాడు పెదబాబు.

## గన్నేర్ల రాజగోపాల్

"ముసలిదాని పాణం కొట్టుకుంటున్నది పెదబాబు. గుక్కెడు నీళ్లో లేకపోతే వచ్చిపోతాది."

"తినటానికి తిండిలేక, తాగటానికి నీళ్ళలేక ఊళ్లో చాలా మంది ప్రాణాలు పోతున్నాయి. అడ్డమయిన వాళ్లందరికి నీళ్ళ కావాలంటే నేనేమి చెరువు తవ్వుకున్నానా?" అంటూ సూటిగా వాడి ముఖంలోనికి చూశాడు పెదబాబు.

"పెదబాబూ!" అంటూ అరిచాడు గంగులు.

"పెదబాబూ! నేను . . . నే నెలాంటివాడినో నీకెరుకే! నచ్చి రగతం తాగేసిన ఈర గంగులని!" అంటూ పెదబాబు వైపు కోపంగా చూశాడు. వాడి కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి. క్రోధంలో వాడి స్థూలదేహమంతా వణకపోచ్చింది.

"నీ వెలాంటివాడివో నాకు బాగా తెలుసు. నా మోచేతి కింద నీళ్ళ తాగేవాడివి! నా కాలి కింద చెప్పులాంటి వాడివి!" అంటూ గంగులువైపు చూసి తేలికగా నవ్వాడు పెదబాబు.

"పెదబాబు!" అంటూ సింహంలా గర్జించాడు గంగులు. అప్రయత్నంగా వాడిచేతివేళ్ళ ముడుచుకున్నాయి.

"ఒరే గంగులూ, ఎన్ని గుండెలు రా నీకు నన్నే బెదరిస్తావు? అని హుంకరించాడు పెదబాబు.

"పెదబాబూ! పెదబాబూ! మీ కాళ్లట్టుకుంటాను గుక్కెడు నీళ్ళ ఇప్పించండి" అంటూ పెదబాబు కాళ్లమీద పడి బతిమాలసాగాడు గంగులు.

"ఒరేయ్ చెప్పేది నీక్కాదూ!" అంటూ కాళ్ళ విడిపించుకోబోయాడు పెదబాబు.

అంతలోనే గంగుడి పెళ్లాం అక్కడికి పరుగెత్తుకొచ్చి "మావ! మావ ముసలిదాని పాణం . . " అంటూ ఏదో చెప్పబోయింది.

"ఆ!" అంటూ గంగులు పెదబాబు కాళ్ళ వదిలి గుడిసెవైపు పరుగెత్తాడు.

పరిగెడుతున్న గంగుల్ని వాడి పెళ్లాన్ని రెండు నిమిషాలు అలాగే నిలబడి చూశాడు. ఆ తరవాత ఇంటిలోపలికి వెళ్లి తలుపులు గడియపెట్టుకున్నాడు. అప్పటికి గాని అతని గుండె దడ తగ్గలేకపోయింది.

పదిహేను నిమిషాలు గడిచాయి. "పెదబాబూ" అన్న గంగులి కేక మళ్లీ వినిపించింది. తలుపులు తీయకుండా ఉండిపోయాడు పెదబాబు.

"పెదబాబూ, నా తల్లిని పొట్టబెట్టుకున్నావు. నా తల్లిమీద ఆన పెదబాబూ. నా తల్లి పాణం తీసిన నిన్ను నిలువునా నరికి పారేయకపోతే నా పేరు ఏన యూర గంగులు కాదు. బయటికి రా పెదబాబు!" అంటూ తలుపులమీద తన్ని కొంది కాలితో బాదసాగాడు. ఆవేశంలోను, ద్వేషంలోను వాడు ఊగుతున్న వాడివలె ఊగిపోతున్నాడు. అప్రయత్నంగా పిడికిలి బిగించి పళ్ళు పటపటమని కొరుకుతున్నాడు.

"ఈ ఏన యూర గంగులి పగ నాగుపాము పగ పెదబాబు. రేపిటికి నీ పాణాలు తీయకపోతే నా తల్లి కడుపున నేను పుట్టనేదు!" అని శపథం చేసి వెళ్లి పోయాడు గంగులు.

వాడు వెళ్లిపోయిన అరగంటకు గట్టిగా ఊపిరి పీల్చాడు పెదబాబు.

ఎంత వద్దనుకున్నా నిన్నటి సంఘటన కనుల

ముందు, మెదిలేసరికి నిట్టూర్చాడు పెదబాబు.

వాడన్న మాటకు ఎదురులేదని పెదబాబుకుతెలుసు. తన బావిలోనుండి ఇక నీళ్ళు దొరకవని ఎక్కడికైనా దూరప్రాంతాలకు వెళ్లితే బాగుంటుందని ఊళ్లోని వారందరిని ప్రయాణంచేశాడు గుక్కెడు నీళ్ళులేక ఇక్కడ చావటం కన్న ఎక్కడికైనా వెళ్లితే ప్రాణాలు నిలుపుకోవచ్చని అందరు ప్రయాణమయ్యారు.

పుట్టిన ఊరు, పెరిగిన పరిసరాలను వదిలి ఎక్కడికో వెళ్లాలంటే అందరికి బాధగానే ఉంది. అందరి కళ్ల లోను నీళ్ళు తిరిగాయి. చివరిసారిగా ఊరివైపుచూసి, ఈశ్వరుడి గుడివైపు తిరిగి చేతులెత్తి నమస్కరించారు. పెదబాబు ముందుగా తన జీపు కదలించాడు. పల్లెవాళ్లందరూ పెదబాబును అనుసరించారు.

* * *

"అహ్హాహ్ . . . అహ్హాహ్!" మీసాలు మెలి పెడుతూ వికటహాసం చేశాడు. అప్పుడే ఊళ్లోనికి అడుగుపెట్టిన చిన వీర గంగులు. వాడి వికటహాసం పాడుపడ్డ ఆ పాత కొంపల్లో మరింత వికటంగా ప్రతిధ్వనించింది! మరో నాలుగడుగులు నడిచి మరింత భయంకరంగా నవ్వాడు వాడు! విశ్వాసంతో వాడివెంట తిరుగుతున్న కుక్కకూడా భౌ భౌ మంది. వీధి నిర్మానుష్యంగా ఉంది. ఎక్కడ ఏ అలికిడి లేదు.

"ఏంది యీయాల పిల్ల కూన అరుపైన ఇని పించటంలేదే?' అని తనలో తనే అనుకొని ముందుకు అడుగులు వేశాడు గంగులు. తప్పతాగి ఉన్నాడేమో అడుగులు తడబడ్డాయి. ఓ కొంపముందుకు వచ్చి ఆగిన గంగులు "ఓరేయ్ నరిసిగా!" అన్న కేకలాంటి అరుపుతో పిలిచాడు. కొంపలోనుండి ఏ అలికిడి లేక పోయేసరికి మళ్లీ కేక పెట్టాడు గంగులు.

"ఓరేయ్ నరిసిగా, ఈ యాలతో పెదబాబు మాకలు పెళ్లిపోయినాయి!" అంటూ తన చేతిలో తళతళ మెరుస్తున్న కత్తికేసి చూసి ముందుకు కదిలాడు. పెదబాబుగారి కాంపౌండు గేటును కాలితో ఒక్క తన్ను తన్నాడు. శబ్దంచేస్తూ గేటు తెరుచుకుంది. కాంపౌండు లోపలికి వెళ్లిన గంగులు ఇంటి తలుపులకు వేలాడుతున్న తాళం చూసి అహ్హాహ్! . . . అని బిగ్గరగా నవ్వాడు.

"పెదబాబు పిరికినాయాలు! సిన యీర గంగులు దెబ్బ అంటే పెదబాబు "అబ్బా!" అంటూ పారి పోయాడు. ఎదవనాయాలు! ఎదవన్నరఎదవ! గంగులంటే ఏటనుకున్నాడో!" అని మరింత పెద్దగా నవ్వుతూ చేతిలోని కత్తి తలుపుల మీద విసిరాడు. ఆ సంతోషం లోనే గుడిసెవైపు నడిచి తడిక కాలితోతన్ని "ఒసే గంగీ! ఇది ఇన్నావా, ఈ గంగులి పేరు సెబితే పెదబాబు పరార్! అహ్హాహ్" నవ్వుతూ చినిగిన బొంత కప్పుకున్న గంగిని కాలితో తన్ని అటు, ఇటు కదిలించాడు.

గంగి కప్పుకున్న బొంత పక్కకు తీసి మావ ముఖం లోనికి చూసి "మావా!" అంది. కాని ఎండిపోయిన పెదవుల మధ్యనుండి మాట పెగిలిరాలేకపోయింది. నాలికతో పెదవులు తడిపి "మావా!" అంది మరో మారు. ఈ మారు మావ అన్నమాట బావిలోనుంచి వచ్చినట్టు హీనస్వరంతో వినిపించింది.

గంగులు ఆత్రంగా గంగి కళ్లలోనికి చూశాడు.

"మావా! గుక్కెడు నీళ్ళు!" శక్తి నంతటిని కూడదీసుకొని అడిగింది గంగి.

గంగులు పెదబాబుగారి పెరటి బావి వద్దకు పారి పోయాడు నీటి కొరకు. బావిలోనికి తొంగిచూస్తే తను వేసిన రాళ్ళు, రప్పలు వెక్కిరించాయి.

"గంగీ!" అంటూ తన నిస్సహాయ స్థితికి జుట్టు పీక్కున్నాడు గంగులు.

"నిన్ను దక్కించుకుంటాను గంగీ!" అంటూ గుడిసె వైపు మళ్లీ పరిగెత్తుకు వచ్చాడు. గంగి మావ వైపు ఆశగా చూసింది. వాడి వట్టిచేతులను చూసి నిరాశతో కళ్ళు తేలవేసింది.

"నిన్ను బతికించుకుంటాను గంగీ, నిన్ను బతికించుకుంటాను" అంటూ గంగిని తన చేతులలోనికి తీసుకొని పైకి లేచాడు గంగులు. గుడిసె బయటికి వచ్చి ఊళ్లోనివారు వెళ్లిన వైపుగా అడుగులు వేశాడు. వాడి వెంట కుక్కకూడా పరుగులెత్తింది.

గంగులు పెళ్ళాన్ని భుజంమీద వేసుకొని పరుగు లాంటి నడక సాగిస్తున్నాడు. మధ్య మధ్యలో "నిన్ను బతికించు కుంటాను గంగీ!" అని తనలోతానే అనుకుంటున్నాడు. అప్పుడప్పుడు గంగిని కుడి భుజం మీదినుండి ఎడమ భుజం మీదికి మార్చుకుంటున్నాడు. అరగంట గడిచిన తరవాత ఏటిఒడ్డు చేరుకున్నాడు గంగులు. ఏటిలో అంతకుముందు పూడ్చిన శవాలను పైకిలాగి పీక్కుతింటున్నాయినక్కలు, రాబందులు.

ఏటి ఒడ్డున గంగిని దింపి రెండు నిమిషాలు గట్టిగా ఊపిరి పీల్చి మళ్లీ ఎత్తుకున్నాడు. ఇసుకలో అడుగులు భారంగా పడుతున్నాయి. వాడి వెంటవచ్చిన కుక్క శవాలను వాసనపట్టి సగం దూరం అటువైపుగా వెళ్లి నక్కలను చూసి మళ్లీ వాడివెంట పరిగెత్తుకు వచ్చింది.

అవలి ఒడ్డు మరో ఇరవై గజాలు ఉందనగా వాడి భుజం మీదఉన్న గంగి పూర్తిగా తలవాల్చేసింది.

"గంగీ" అంటూ కూలబడ్డాడు గంగులు. వాడి అరుపుతో శవాన్ని పీక్కుతింటున్న నక్కలు పారి పోయాయి!

భుజంమీదినుండి గంగి శవాన్ని దించి "నిన్ను దక్కించుకోలేక పోయాను గంగీ!" అంటూ దాని ముఖాన్ని రెండు చేతులతోను కదిలించాడు. ఎండి పోయిన పెదవుల మధ్యనుండి బయటికి వచ్చిన పలచటి నాలికతో గంగి ముఖం చాలా భయంకరంగా కనిపించింది. ఇసుకలో గుంటతీసి గంగి శవాన్ని పాతిపెట్టి ఏదో నిశ్చయానికి వచ్చినట్టు గట్టువైపు అడుగులు వేశాడు. ఇప్పుడు వాడి ముఖంలో క్రూరత్వం కొట్టవచ్చినట్టగుపిస్తున్నది. నల్లటి ముఖంలో ఎర్రబారిన కళ్ళు మరింత భయాన్ని కలిగిస్తున్నాయి.

ఏరుదాటి బయటికివస్తే దూరంగా పోతున్న ఊరి వాళ్ళు కనుపించారు.

"నరిసిగా, ముత్యాలూ" అంటూ కేక పెట్టాడు గంగులు. గొంతుచించుకొని మరో మారు కేకవేసే సరికి వెళుతున్న వారు తిరిగి చూశారు.

పదిహేను నిమిషాలు గడిచేలోపల వారిని చేరు కున్నాడు గంగులు. వాడి ఆకారాన్ని చూసి అందరు జడుసుకున్నారు. ఏంచేస్తాడో అన్న భయంతో ఎక్కడివారక్కడ నిలిచిపోయారు.

"ఓరేయ్ నరిసిగా! పెదబాబు ఎక్కడ?" అని కఠినంగా అడిగాడు.

ముందు వెళుతున్నట్టు సైగ చేశాడు నరిసిగాడు. రెండు ఫర్లాంగుల దూరంలో జీపు చూసి "పెద బాబూ" అంటూ గొంతు చించుకొని పరిగెత్తాడు.

"పెదబాబూ" అన్న గంగులు కేక వినిపించేసరికి స్టీరింగు ముందు కూర్చున్న పెదబాబుకు ముచ్చెమటలు పోశాయి! అప్రయత్నంగా చేతులు వణికి గుండె జల్లుమంది. ఆక్సిలేటరును తొక్కటానికి వెళ్లినకాలు బ్రేకుమీద పడి జీపు ఆగిపోయింది! పెదబాబు వెనక వస్తున్న గంగుల్ని సైడు అద్దంలో చూసి క్షణ క్షణానికి సడులుతున్న ధైర్యాన్ని కూడదీసుకొని ఆక్సిలేటరును తొక్కాడు. జీపు స్పీడు అందుకుంది.

"పెదబాబూ! పెదబాబూ!" అంటూ జీపు వెన కాలే పరుగెత్తసాగాడు గంగులు.

కొద్దిసేపు గడిచేటప్పటికి జీపు వాడి కనుచూపు మేర దాటిపోయింది. అయినా గంగులు అలాగే పరిగెత్తసాగాడు. వాడివెంట కుక్కకూడా పరిగెత్తింది. అలా అరగంట పరుగెత్తి రోడ్డు చేరుకున్నాడు. గంగులు. ఆయాసం ఎక్కువైంది. "పెదబాబూ!" అని గొంతు చించుకొనేటప్పటికీ నోరు ఎండిపోయింది. మాటిమాటికి నాలుకతో పెదవులు తడుపుకోసాగాడు.

దూరంగా రోడ్డుమీద ఏదో కనిపించేసరికి "పెద బాబూ!" అంటూ మరో కేక పెట్టి మళ్లీ పరిగెత్త సాగాడు. ఈ కేకమాత్రం వాడి నోటినుండి చాలా

> ఒక ఆలోచనకూ ఒక వస్తువుకూ మధ్యవర్తివంటిది—చిత్రపటం.
>
> —కోల్‌రిడ్జ్

హీనస్వరంతో వెలువడింది. మరికొంతసేపలాగే పరిగులెత్తేసరికి నోరు పూర్తిగా తడి ఆరిపోయింది. క్షణ క్షణానికి నాలికతో పెదవులను తడుపుకున్నప్పటికి ప్రయోజనం లేకపోయింది. అందుకుతోడు ఆయాసం ఎక్కువై ఊపిరి పీల్చటానికి వీలుకాకపోయింది. రాత్రి బాగా తాగి ఉండటం వల్ల దప్పిక మరింత ఎక్కువైంది. ఆవేశంలో పెరిగెత్తుతున్న సమయంలో రోడ్డుమీది కంకరరాయి తగిలి మూడు పొర్లులు పొర్లాడు గంగులు. కుడికాలి బొటనవేలు చిదిమిపోయి రక్తం కారసాగింది. బాధతో దానివైపు చూసినంతసేపు చూసి బొటనవేలిని నోట్లో పెట్టుకొని చప్పరించాడు. ధూళితో నిండి గడ్డకట్టిన రక్తం పుల్లగా ఉంది. అంతబాధలోను మళ్లీ పరిగెత్తసాగాడు గంగులు. కాని ఎంతోదూరం పరిగెత్తలేకపోయాడు. కాలు విపరీతంగా నొప్పి పెట్టింది. మరోవైపు నోరు పూర్తిగా ఎండిపోయింది. "దాహం . . నీళ్ళ . . !" అంటూ రోడ్డుమీదే పడిపోయాడు గంగులు. కిందపడి పొర్లుతున్న గంగులు చుట్టూ తిరిగి భౌభౌ మంటూ మొరగసాగింది కుక్క.

రోడ్డుకు అవలివైపున కొద్దిదూరంలో ఉన్న చింతచెట్టు చాటున ఉన్న కుక్కపిల్ల ఆ కుక్క అరుపుతో బయటికి వచ్చింది. కుక్కపిల్లతోపాటు బస్సుకొరకు ఎదురుచూస్తున్న పంతులమ్మ చెట్టు చాటునుండి వచ్చి రోడ్డుమీద చూసింది.

ఎవరో రోడ్డుమీద పడి తన్నుకులాడటము, వాడి చుట్టూ కుక్క తిరుగుతూ మొరగటము చూసిన పంతులమ్మ రోడ్డుమీదికి వెళ్ళింది.

"అయ్యో . . . నీళ్ళ . . ! గొంతు ఎండుకు పోతూంది నీళ్ళ!" అంటూ అటువైపు నుండి ఇటు వైపు పొర్లినవాడిని చూస్తూనే నిశ్చేష్టురాలయింది పంతులమ్మ. ఒక్కమారుగా ఆమె ముఖంలో ఎక్కడ లేని అసహ్యము పుట్టుకువచ్చింది.

"ఛీ! . . . ఛీ! ఈ రాక్షసుడా? వీడు నికృష్టపు చావు చావ వలసిందే!" అంటూ ముఖం ప్రక్కకు తిప్పుకుంది. తనకు పుత్రశోకం కలిగించిన వీడికీ శిక్ష చాలదు. వీణ్ణి చిత్రహింస చేయాలి! నెల్లాళ్ల పసికందు అని కూడా జాలిలేని ఈ కసాయి వాడికి ఇంత తొందర లోనే భగవంతుడు శిక్ష విధిస్తాడనుకోలేదు.'

"అయ్యో. కడుపులో మంట! చచ్చిపోతున్నాను. దాహం. . . నోరెండిపోతున్నది. నీళ్ళు! అమ్మా. . . బాబు. . . దేవుడా, నీళ్ళు!" అంటూ గంగులు దాహానికీ, కడుపులో మంటకు ఓర్చుకోలేక తపతప కాళ్ళతో నేలపై కొట్టసాగాడు.

హృదయవిదారకమైన వాడి అరుపులు, చేష్టలు ముఖం పక్కకు తిప్పుకున్నపంతులమ్మను వాడివైపు తిప్పుకున్నాయి.

"కడుపులోమంట!. . . కడుపులో మంట!. . . నీళ్ళు!. . . నీళ్ళు!. . ." అంటూ వాడు పొత్తికడుపు మీద కొట్టుకోసాగాడు.

'తన కడుపువంట నిర్దాక్షిణ్యంగా కూల్చిన వాడు, పొత్తిళ్ళలోని పసికందును పొడిచి చంపిన ఈ రాక్షసుడు ఇంతకంటే మరింత నికృష్టంగా చావాలి.

తమ ప్రేమకు నిదర్శనంగా కలిగిన బాబు రఘు బాబును చూసి ఎంతో మురిసిపోయేవాడు.

"పద్మా! మన బాబును చూసి అయినా మా నాన్న మన ప్రేమకు అంగీకరిస్తాడు పద్మా!" అన్నాడు. చాలామార్లు రఘుకాని. . . కాని. . . ఆ రోజున.,

"పద్మా! ఉన్న ఆశకూడా నేటితో నిరాశ అయింది. మా నాన్న చాలా కఠినుడు పద్మా! ఇక్కడ ఎన్నో రోజులు మనం ఇక్కడ ఉండకూడదు. దూరంగా వెళ్ళిపోదాము. మా నాన్న ఆస్తిలో చిల్లిగవ్వకూడా అవసరం లేదు. నీఉన్నావు చాలు పద్మా! మనకిద్దరికి పెద్దఆస్తి బాబే పద్మా" అంటూ ఉయ్యాలలో పడుకున్న బాబును చేతులలోనికి తీసుకొని మురిసి పోయాడు.

"ఏం జరిగింది రఘు?" అంటూ అతని జుట్టు లోనికి వేళ్ళు పోనిచ్చి ఎంతో ఆప్యాయంగా అడిగింది పద్మ."

"పద్మా!" అంటూ కళ్ళనిండా నీళ్ళు పెట్టుకున్నాడు రఘు.

"రఘూ! అసలు ఏమి జరిగిందో నాకు చెప్పవూ?" అంటూ అతని కన్నీరు చీరతో తుడిచింది.

జాలిగా తన కళ్ళలోనికి చూశాడు రఘు. "పద్మా రెండు మూడు రోజులలోపల నేను ఏర్పాట్లన్ని చేస్తాను. మనం ఎక్కడికైనా వెళ్ళిపోయి హాయిగా సుఖపడదాం పద్మా!" అన్నాడు మళ్ళీ ఏం జరిగిందో చెప్పకనే.

పద్మ రఘు చేతులలోనుండి బాబును అందుకుని పాలిచ్చి ఉయ్యాలలో వేసింది. పద్మ పాలిస్తూంటే రఘు పద్మవైపు బాబువైపు కన్నార్పకుండ చూశాడు.

ఎందుకో బయటికి వెళ్ళి పది నిమిషాలలో తిరిగి వచ్చింది పద్మ.

"ఓరేయ్ గంగులూ, వాడు నా బిడ్డరా. వాడు మాకు పుట్టినబిడ్డరా, మా ప్రేమకు నిదర్శనంగా పుట్టినబిడ్డ. నన్ను చంపి తరవాత వాడిని చంపరా!" అన్న రఘు మాటలు వినిపించాయి.

గంగులు రఘును ఒక తోపుతోసి ఉయ్యాలవద్దకు వెళ్ళాడు.

"ప్రేమ. . . ప్రేమ ఏంటి చినబాబూ? కులం లేనిదానితో కులకటము ప్రేమా? చదువుకున్నోళ్ళని ఇదేనా? మీ జీవితానికి మచ్చ చినబాబూ ఇది. అందుకని పెదబాబు ఈ అడ్డు తప్పించమన్నాడు." అంటూ నడుములో దోపుకున్న కత్తితీసి ఉయ్యాలలో పడుకున్న పసికందును పొడిచాడు.

తలుపులవద్ద నిలుచున్న పద్మ ఆ దృశ్యాన్ని చూసి కెవ్వుమని కేకవేస్తూ పడిపోయింది.

తన చేతకానితనానికి సిగ్గుపడి పారిపోయాడు రఘు.

"దేవుడా నీళ్ళు. . . అమ్మా నీళ్ళు!" అంటూన్న గంగులకేకతో జ్ఞాపకాలనుండి తెప్పరిల్లింది పద్మ.

"అమ్మా. . . తల్లీ. . . నీ కాళ్ళట్టుకుంటాను. గుక్కెడునీళ్ళు" అంటూ గంగులు పద్మ కాళ్ళు పట్టుకోబోయాడు.

"ఛీ!" అంటూ పక్కకు తప్పుకుంది పద్మ.

"అయ్యో మంట. . కడుపులో మంట. నాలిక పిడచకట్టుకపోయింది. దేవుడా నీళ్ళు. . . గుక్కెడు నీళ్ళు. . . చచ్చిపోతున్నాను. తల్లి. . . అమ్మా!" అంటూ కాసేపు తన్నుకులాడి గంగులు స్మారకం తప్పిపోయాడు.

"అమ్మా!" అంటూ ఆక్రోసించిన వాటి హీనస్వరం వినిపించేసరికి పద్మలో ఎక్కడో దాక్కున్న మాతృహృదయం మేల్కొంది.

పది, పది హేను నిమిషాలకన్న ఎక్కువ బ్రతకడు వాడు. తను ఏదైతే ఆశించిందో అదే జరుగుతున్నది. వాడు ఆ రాక్షసుడు, కసాయివాడు చచ్చిపోతాడు. అప్రయత్నంగా పద్మముఖం సంతోషంతో వెలిగి పోయింది. పెదబాబు చెప్పింది అది ఎంత రాక్షస కృత్యమైనా చేసే చదువులేని ఈ మూర్ఖుడు ఇక ఉండడు!

'వాడు చదువులేని మూర్ఖుడు. మనస్సులేని ద్విపాదపశువు వాడు. మంచి ఏదో చెడుఏదో తెలియక ఎన్నో పాపకృత్యాలు చేశాడు. తెలియనిమూర్ఖుడు వాడు. మరి చదువు, సంస్కారము, మంచి, చెడు తెలిసి ఆలోచించే విచక్షణ జ్ఞానం కలిగిన నీవు ఏమి చేశావు? ఒక్క మనిషి చావుబ్రతుకులలో ఉంటే వాడిచావు కోరిన నీవూ మూర్ఖురాలివేగా?' అని నిలదీసి ప్రశ్నించింది. అంతరాత్మ పద్మను.

'జాలి, కరుణ, దయ, — ధర్మం, సానుభూతి, సహాయము, ఏవి వాడికి తెలియవు. మనస్సులేని పశువు వాడు. మరి నీలో జాలిఉంది కరుణ ఉంది. దయాధర్మాలున్నాయి. అన్నింటికీ మించిన క్షమాగుణం ఉంది వాడి చావుకు వాడిని వదిలిపెట్టావు. మనస్సు లేదు కాబట్టి పశువుకు, వాడికి భేదంలేదు. ఇప్పుడు నీవు చేసినదాన్నిబట్టి చూస్తే వాడికి, నీకు ఇక భేదమేమిటి?'

'అవును వాడికి నాకు భేదమేమిటి?' తన్ను తనే ప్రశ్నించుకుంది పద్మ.

'ఊహూ! వాడు కసాయివాడు, పసికందుని జాలి లేక చంపివేశాడు.!'

'మరి ఇప్పుడు నీవు చేసిందేమిటి? ఆ కసాయివాడే నీళ్ళు. నీళ్ళు' అంటూ ఆక్రోశిస్తూంటే చూస్తూ ఉండిపోయావు! మరి నీవు అంతనిర్దయగా ఉండటం కఠినత్వమనిపించుకోదూ?'

"ఊహూ!" తనేమి చేసింది వాడిచావుకు తనెలా కారణమౌతుంది?'

'కారణంలేకపోయినా కనీసం మానవుడిమీద మానవుడు చూపించవలసిన సానుభూతి, సహాయము చెయ్యలేకపోయావు' అంది అంతరాత్మ.

'సహాయము ఎలా చెయ్యను? వాడికి కావలసింది నీళ్ళు. తాగటానికి గుక్కెడు నీళ్ళు లేకనేకదూ మనుష్యులంతా ఊళ్ళు వదిలి పోతున్నారు?'

తన పసికందు చనిపోవటంతోనే తన, మాతృహృదయం బాధపడినట్టు వాడు చనిపోవటంతోనే వాడితల్లికూడా బాధ పడుతుంది.

బాధతో మెలికలు తిరుగుతూ "అమ్మా. . . తల్లీ" అంటూ స్మారకం తప్పిన ఆ దృశ్యం మరోమారు పద్మ కళ్ళముందు మెదిలింది.

ఆమె హృదయం ఆర్ద్రమయింది. అంతవరకు ఆమెలో దాగిన జాలి, కరుణ, ఉప్పెనలా పొంగుకు వచ్చాయి.

కిందపడిపోయిన గంగులు ముఖాన్ని అటు ఇటు కదిలించి చూసింది. ముక్కువద్ద వేలుంచి శ్వాస ఆడటం గమనించి ఆత్రతగా నీటికొరకు నలువైపుల చూసింది. కనుచూపుమేరలో ఎక్కడా నీరు కనిపించక పోయేసరికి నిస్పృహతో నిలిచిపోయిన పద్మ వాడి పక్కగా కాళ్ళు బారచాచి పడుకున్న కుక్కను, తన వెంట వచ్చిన కుక్కపిల్ల, దాన్ని కడుపుమీద ఎక్కి పాలు తాగడము చూసింది. పద్మ క్షణకాలం వాటివైపే కన్నార్పకుండా చూసింది ఆమె మనోవీధి ఏదో తటిల్లతలా మెరిసింది.

పద్మ గంగులు పక్కగా కూర్చొని వాడి తలను తన ఒడిలోనికి తీసుకొని, ముందుగా రెండు ధారలు వాడిపెదవులమీద తడిపి కుడిచన్ను వాడిపెదవుల కందించింది.

కంకరరోడ్డు చేరుకున్న పల్లెవాసులు నరసిగాడి కేకతో ఎక్కడివారక్కడ నిలిచిపోయారు.

"ఓరేయ్ మూల్యాలు, అటువైపు ఏందిరా? ఓరేయ్ అటు. . . అటు. . మనపల్లెవైపు." అంటూ తమ పల్లెవైపు చూపించాడు నరసిగాడు.

నరసిగాడు చూపించినవైపు అందరు చూశారు! దట్టంగా కమ్మిన నల్లని మేఘాల మధ్యనుండి కుండపోతగా పోస్తున్న వర్షపుధారలు! అమృత ధారాలు! ★